క్లుప్తంగా

సద్దుమణిగిన స్థల వివాదం

తాండూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారు సర్వే నంబర్ 79లో కొంతకాలం నుంచి వివాదస్పదంగా ఉన్న బందెలదొడ్డి భూ వివాదానికి పరిష్కారం లభించింది. ఆ సర్వే నంబర్‌లో పూర్వకాలం నుంచి బందెల దొడ్డి కొనసాగుతోంది. అయితే నాలుగేళ్ల నుంచి ఆ స్థలం తనదని పెరుగు గంగయ్య గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తున్నాడు. గిర్దావర్ ఎజాజుద్దీన్, ఎంపీవో అనిల్ గురువారం మోకా వద్దకు వెళ్లి భూమి కొలతలు వేయించి, రికార్డులు పరిశీలించి బందెల దొడ్డి ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్నట్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని గంగయ్య కుటుంబ సభ్యులకు వివరించారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కోటపల్లి: మండలంలోని సర్వాయిపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి శంకరయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశాలు జారీ చేశారు. సర్వాయిపేట గ్రామానికి చెందిన భూక్యా సతీశ్ కోర్టు జామీన్ పేపర్ల కోసం పంచాయతీ కార్యదర్శి శంకరయ్యను సంప్రందించగా గ్రామపంచాయతీ రికార్డుల్లో పేరు లేనందున రూ.2వేలు లంచం అడిగాడు. భూక్యా సతీశ్ ఎంపీడీవో లక్ష్మయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో షోకాజ్ నోటీస్ జారీ చేసి, విచారణ జరిపిన అనంతరం గురువారం శంకరయ్య సస్పెండ్ చేసినట్లు ఆదేశాలు జారీ అయ్యాయి.

మున్సిపల్ కమిషనర్లకు ప్రశంస

మందమర్రిరూరల్/లక్సెట్టిపేట: గత ఆర్థిక సంవత్సరం 2024–25 ఆస్తి పన్ను వసూళ్లలో లక్సెట్టిపేట మున్సిపాలిటీ 86.65శాతం పన్ను వసూలు చేసి ప్రథమ, మందమర్రి మున్సిపాలిటీ 77.35శాతం వసూలు చేసి రెండో స్థానంలో నిలువగా హైదరాబాద్‌లో పురపాలక పరిపాలన శాఖ రాష్ట్ర డైరెక్టర్ టీకే శ్రీదేవి చేతుల మీదుగా మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ ప్రశంస పత్రాలు అందుకున్నారు.

దంచికొట్టిన వర్షం



ముల్కల్లలో కురుస్తున్న భారీ వర్షం

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/వేమనపల్లి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం దంచికొట్టిన వర్షంతో వాతావరణం చల్లబడింది. హాజీపూర్ మండలంలోని గ్రామాలతోపాటు కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట, నంనూర్, ముల్కల్ల వేంపల్లి ప్రాంతాల్లో వర్షం కురిసింది. గుడిపేటలో మక్కలు తడిసి ముద్దయ్యాయి. వేమనపల్లి మండలంలో మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. కంకులు, కల్లంలో అమ్మకానికి సిద్ధంగా మక్కలను వర్షం నుంచి కాపాడుకునేందుకు కవర్లు కప్పారు. వరిపంట పాలు పోసుకునే దశలో నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వొకేషనల్ పరీక్షకు 16మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం వొకేషనల్ పరీక్షలు 12కేంద్రాల్లో నిర్వహించగా, 1143మంది విద్యార్థులకు గాను 1127మంది హాజరయ్యారు. 16మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈవో యాదయ్య పరిశీలించారు.

కమిటీ ఎన్నిక

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని దళిత అభివృద్ధి శాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో గురువారం మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా గొడిశెల దశరథం, కో కన్వీనర్లుగా పొట్ట మధుకర్, దుర్గం ఎల్లయ్య, ఇరికిళ్ల పురుషోత్తం, తొగరి సుధాకర్, నాగరాజు, బాలయ్య, మోతే సుజాత, సింహచలం, కాటం రాజేష్‌ను ఎన్నుకున్నారు. దళిత అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు రవీందర్‌రెడ్డి, ఈడీ దుర్గాప్రసాద్, ఎమ్మార్పీఎస్, మాల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ కాలిన పంపు మోటారు

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో మళ్లీ తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గురువారం సాయంత్రం పంపు మోటారు కాలిపోవడంతో నీటి సరఫరా ఆగింది. మూసివేతకు గురైన మాదారం వన్ ఇంక్‌లెన్ వద్ద పంపు మోటారును బయటకు తీసి మరమ్మతు చేయించే పనుల్లో ఉన్నారు. అయితే నాలుగు నెలల వ్యవధిలో 4సార్లు పంపు మోటారు కాలిపోయింది. 45రోజుల్లో 2 సార్లు 75హెచ్‌పీ పంపు మోటారు కాలిపోవడం వల్ల ఒక్కసారిగా నీటి ఇబ్బందులు తలెత్తాయి. ప్రత్యామ్నాయంగా సింగరేణి అధికారులు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. అయినా కూడా నీటి అవసరాలు పెరిగి ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారు. సత్వరంగా పంపు మోటారుకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నిర్మించారు.. వదిలేశారు

మందమర్రిరూరల్: సండ్రోన్‌పల్లి వద్ద...



చెన్నూర్‌రూరల్: కన్నెపల్లిలో..





భీమారం: నీళ్లు నింపకుండా.. నిరుపయోగంగా



వేమనపల్లి తాటివనం వద్ద..

పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టీలు నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. చెన్నూర్ రూరల్ మండలం కన్నెపల్లి గ్రామంలో, వేమనపల్లి మండల కేంద్రంలో, భీమారం మండలం ఎస్సీ కాలనీలో, ఆరెపల్లి గ్రామంలో, మందమర్రి మండలంలోని శంకర్‌పల్లి, సండ్రోన్‌పల్లి, సారంగపల్లిలో లక్షలు వెచ్చించి నిర్మించిన నీటితొట్టీలు నీరు పట్టకపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి నీరునింపి వినియోగంలోని తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. – వేమనపల్లి/చెన్నూర్‌రూరల్/భీమారం/మందమర్రిరూరల్

సాగునీటి కాల్వలపై నిర్లక్ష్యం

డీ-30 కాల్వలో పెరిగిన తుంగ



డీ-30 డ్రాప్ కూలి కోతకు గురైన రోడ్డు



డీ-28 కాల్వలో పడిపోయిన లైనింగ్



కడెం ప్రాజెక్టు, గూడెం ఎత్తిపోతల నీటిని పంట పొలాలకు అందించడం కోసం దండేపల్లి మండలంలో ఏర్పాటు చేసిన సాగునీటి కాల్వలు పలుచోట్ల శిథిలమయ్యాయి. డీ-22, 25, 28, 30కాల్వల డ్రాప్‌లు, లైనింగ్‌లు కూలి కాల్వలో పడిపోవడంతో, తుంగ మొలిచి కొన్నిచోట్ల నీళ్లు ముందుకెళ్లడం లేదు. ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షించి, సాగునీటి కాల్వల్లో చెత్తను తొలగించడంతో పాటు, శిథిలమైన కాల్వల లైనింగ్‌లు, డ్రాప్(రాప్)లకు మరమ్మతు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈఈ సంజీవను సంప్రదించగా కాల్వల లైనింగ్‌లు, డ్రాప్‌ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే మరమ్మతు చేపడుతామన్నారు. – దండేపల్లి



డీ-30 కాల్వలో పడిపోయిన లైనింగ్

రాజ్యాంగం పరిరక్షణ అందరి బాధ్యత

• బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



బెల్లంపల్లి: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: భారత రాజ్యాంగం పరిరక్షణ అందరి బాధ్యతని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జైబాబు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఏడు మండలాలు, పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ వైద్యుల అంజన్ కుమార్, పీసీసీ జనరల్ సెక్రెటరీ రఘునాథ్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని కాంగ్రెస్ పార్టీ నస్పూర్ మండల ఇన్‌చార్జి నూకల రమేశ్ తెలిపారు. ఆ పార్టీ పిలుపుమేరకు గురువారం నస్పూర్ మండలంలోని 6, 17వ వార్డుల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పోగ్రాం కో ఆర్డినేటర్ అంకతి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుర్మిళ్ల వేణు, నాయకులు పూదరి ప్రభాకర్, ధర్మి మధు, తాళ్ల సంపత్‌రెడ్డి, ఏల్పుల రవీందర్, రావి కిషన్ పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆదేశాల మేరకు గురువారం హాజీపూర్ మండలంలోని పడ్తనపల్లి, కర్ణమామిడి, టీకానపల్లి, సబ్బెపల్లి గ్రామాల్లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మాధవరపు రాజేశ్వర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ కోటి సత్తయ్య, వైస్ చైర్మన్ రాసమల్ల శ్రీనివాసగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆర్కే 6 గనిలో ఘనంగా చండీయాగం



యాగంలో పాల్గొన్న జీఎం దంపతులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిపై చండీయాగం ఘనంగా నిర్వహించారు. గని ఆవరణలో గల మైసమ్మ ఆలయంలో ప్రతీ సంవత్సరం ఉగాది నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం చండీయాగం నిర్వహించారు. కార్యక్రమానికి ఏరియా జీఎం శ్రీనివాస్, ఏజెంట్ శ్రీధర్, గని మేనేజర్ తిరుపతి దంపతులు హాజరై యాగంలో పాల్గొన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ. సీతారామయ్య, డైరెక్టర్ల సతీమణులు ఎల్. మాలతి సూర్యనారాయణ, విజయలక్ష్మి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, ఫిట్ ఇంజినీర్ శ్యాం కుమార్, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేటి సమాచారం

ఉచిత మెగా వైద్యశిబిరం

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతువేదికలో శుక్రవారం మంచిర్యాల జిల్లా వైద్యశాఖ, వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యులతో పాటు మెడిలైఫ్ ఆస్పత్రి వైద్యులు హాజరు కానున్నట్లు తెలిపారు. సాధారణ వైద్య నిపుణులతో పాటు ఆర్థోపెడిక్, పిల్లల వైద్య, ఇతర వైద్య నిపుణులు పాల్గొననున్నట్లు, సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్‌రూరల్: కోటపల్లి మండలం దేవులవాడకు నూతనంగా 33కేవీ లైన్ పనులు శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ వి.గంగాధర్, డీఈ ఖైసర్, ఏడీఈ బాలకృష్ణ తెలిపారు. చెన్నూర్ మండలంలోని సుద్దాల, కొమ్మెర, పొక్కూరు, దుగ్నెపల్లి, ఆస్నాద గ్రామాల సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

టాస్క్ ఆధ్వర్యంలో క్యాంపస్ మేళా

మంచిర్యాలఅర్బన్: మిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం టాస్క్ ఆధ్వర్యంలో క్యాంపస్‌మేళా నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ శ్రీనివాస్‌రాజు తెలిపారు. క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో గూగుల్, పే టీఎం, జస్ట్‌డయల్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు, ఆక్సిస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, మెడిప్లస్ సంస్థలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. 2023, 2024, 2025 విద్యా సంవత్సరంలో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మొక్కల పరిరక్షణ ద్వారా వాతావరణ సమతుల్యత



మిట్టపల్లిలో నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్

జైపూర్: మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా వాతావరణ సమతుల్యతను సాధించవచ్చని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మండలంలోని మిట్టపల్లిలో గురువారం వాటర్ షెడ్ యాత్ర నిర్వహించగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు, ఏపీవో బాలయ్య, ఏపీఎం రాజ్‌కుమార్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కీలకం

కాసిపేట: వాతావరణ సమతుల్యత, నీటి సంరక్షణ మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణ ఎంతో కీలకమని మొక్కలు నాటడం ద్వారా వాతావరణ సమతుల్యత సాధించవచ్చని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. మండలంలోని దేవాపూర్ గ్రామపంచాయతీలో గురువారం వాటర్‌షెడ్ యాత్ర ప్రారంభించారు. గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. డీఆర్డీవో కిషన్, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, మాజీ జెడ్పీటీసీ రౌతు సత్తయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, నాయకులు ఉన్నారు.

'రాజీవ్ యువ వికాసం' సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: రాజీవ్ యువ వికాసం పథకాన్ని జిల్లాలోని మైనారిటీ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వరకు ఉన్న గడువును ప్రభుత్వం 14వరకు పొడిగించిందని, ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పణలో సమస్యలు తలెత్తితే ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

• బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్



మద్దతు తెలుపుతున్న వెంకటేశ్వర్‌గౌడ్

జైపూర్: ఇందారం ఐకే–ఓసీపీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మె చేస్తున్నారు. వారి సమస్యలు పరిష్కరించడానికి కనీసం చర్చలు జరపని యాజమాన్యం, ఇతర కార్మికులను నియమించడానికి ప్రయత్నించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నొనూరి వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. మండలంలోని ఇందారం ఐకే –ఓసీపీపై వాల్వో డ్రైవర్లు చేపట్టిన సమ్మెకు గురువారం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులతో కలిసి ఆయన మద్దతు తెలిపారు. అధికారులు స్పందించి ఓసీపీ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూట రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బోధన నైపుణ్యం పెంపునకు శిక్షణ



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల బోధన నైపుణ్యం పెంపునకు శిక్షణ దోహదపడుతుందని డీఈవో యాదయ్య అన్నారు. గురువారం గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోన్నతి పొందిన ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ప్రాథమిక పాఠశాలల ఎఫ్ఎల్ఎన్ హెచ్ఎం శిక్షణ శిబిరంలో మాట్లాడారు. జిల్లా సమగ్రశిక్ష కో–ఆర్డినేటర్లు సత్యనారాయణమూర్తి, చౌదరి, ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్, రిసోర్సు పర్సన్లు మల్లేశం, రాజగోపాల్, శేఖర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్లాట్లను కబ్జా నుంచి విడిపించాలని నిరసన



నిరసన తెలుపుతున్న బాధితులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని గర్మిళ్ల రెవెన్యూ డివిజన్ సర్వే నంబర్ 290లో గల 21మంది ప్లాట్లను గోదావరిఖనికి చెందిన వ్యక్తి కబ్జా చేసి, తమ ప్లాట్ల హద్దులను తొలగించి కంచె వేశారంటూ సంబంధిత ప్లాట్ల యజమానులు గురువారం జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్ సమీపంలో గల గీతామందిర్ వద్ద ఆందోళన చేపట్టారు. కబ్జా చేసిన వారిపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తమ ప్లాట్లను కబ్జా నుంచి కాపాడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, లింగయ్య, మల్లయ్య, ఆకుల దిలీప్, శంకర్, జనార్దన్, నారాయణ, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

నెన్నెల/భీమారం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా వెళ్తున్న నెన్నెల, భీమారం మండలా బీజేపీ, బీజేంఐఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో నెన్నెల బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్, మాజీ అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, భీమారంలో జిల్లా నాయకులు కొమ్ము కుమార్‌యాదవ్, వేల్పుల రాజేశం తదితరులు ఉన్నారు.

వేమనపల్లి డెప్యూటీ తహసీల్దార్‌గా పోశన్న

వేమనపల్లి: మండల డెప్యూటీ తహసీల్దార్‌గా ఏ.పోశన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ వర్ధంతి

భీమారం/పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో, భీమారం మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి యువకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, నాయకులు మాడిశెట్టి సత్యనారాయణ, వెంకటస్వామి, భీమారంలో కొక్కుల నరేష్, కొమ్ము సురేందర్, మెండె మల్లేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎం దిష్టిబొమ్మ దహనం

మంచిర్యాలఅర్బన్: హెచ్‌సీయూ భూముల జోలికొస్తే ప్రభుత్వ పతనం తప్పదని పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, యూఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, సన్నీగౌడ్, తిరుపతి అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం బస్టాండ్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల బాధ్యులు సుమంత్, అభిలాష్, అఖిల్, శ్రీనివాసరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

భీమారం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం ఏవో అత్తె సుధాకర్ తనిఖీ చేశారు. షాపుల్లో నిల్వ ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగుల మందులు అమ్మాలని డీలర్లను ఆదేశించారు.

సన్నబియ్యం పంపిణీ

చెన్నూర్‌రూరల్/మందమర్రిరూరల్/నెన్నెల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చెన్నూర్ మండలంలోని అక్కెపల్లి, చింతలపల్లి గ్రామాల్లో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మందమర్రి మండలంలోని చిర్రకుంటలో తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవో రాజేశ్వర్, నెన్నెల మండలంలోని నెన్నెల, చిత్తాపూర్, ఆవుడం గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు గట్టు మల్లేష్, హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, రాజశేఖర్ హాజరై ప్రారంభించారు.


ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

లక్సెట్టిపేట: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు పార్లమెంటులో ఆమోదం తెలిపినందుకు మండలంలోని బీజేపీ నాయకులు స్థానిక ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు రఘునాధరావు, హరిగోపాల్, హేమంత్, రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరం

పాతమంచిర్యాల: పట్టణంలోని రాంనగర్ భగవద్గీత అధ్యయన మండలిలో గురువారం లయన్స్ క్లబ్ మంచిర్యాలశాఖ, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించారు. 180మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రేకుర్తి కంటి ఆస్పత్రి ప్రతినిధి ప్రభాకర్, లయన్స్ క్లబ్ మంచిర్యాల శాఖ అధ్యక్షుడు బాలమోహన్, గోల్డెన్ జూబ్లీ అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదు తరాల అ'పూర్వ' కలయిక



కోటపల్లి: నేటి సమాజంలో అన్నదమ్ములు, బంధువులకు సమయం కేటాయించే సందర్భాలు చాలా తక్కువ.. ఉద్యోగాలు, వ్యాపారాల్లో బిజీబిజీగా ఉండే ఈ సమాజంలో ఓ కుటుంబానికి చెందిన ఐదు తరాల వారు ఒక్కచోట కలిశారు. వారి నాయనమ్మ అయిన చల్ల కమలమ్మకు వంద సంవత్సరాలు పూర్తి కాగా అందరు ఒక్కచోట కలువాలని నిర్ణయించుకున్నారు. ఐదు తరాలను ఏకం చేసేందుకు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఒకరి నుంచి మరొకరి వివరాలు సేకరించి రెండు నెలల సమయం తర్వాత సిర్సా గ్రామం వేదికగా గురువారం కలుసుకున్నారు. కమలమ్మని సత్కరించి, అందరూ తమ సుఖ దుఃఖాలను పంచుకున్నారు.

భూములపై ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరు మీద భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే నిర్ణయాన్ని విరమించుకోవాలని సూచించారు. ప్రభుత్వం హెచ్‌సీయూ విద్యార్థులపై అమానుషంగా వ్యవహరించి లాఠీచార్జి చేయటాన్ని తీవ్రంగా ఖండించారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు డ్రైవర్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రామ్‌కుమార్, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

నెన్నెల: మండలంలోని గంగారాంలో ఈ నెల 6న నిర్వహించే సీతారామ కల్యాణ మహోత్సవానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను గురువారం గంగారాం హన్మాన్ స్వాములు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ఆహ్వానించారు.